జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 29-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 469 పేజీలు: 4 వెల : రూ.7

# నగరం.. చెత్త చెత్తగా!







* అధ్వానంగా డ్రైనేజీలు
* చిన్నపాటి వర్షానికి రోడ్డుపైకి మురుగునీరు
* రోగాల బారిన నగరవాసులు
* శ్రీకాకుళం కార్పొరేషన్‌కు 78వ ర్యాంకు
* స్వచ్ఛ శ్రీకాకుళం.. ప్రకటనలకేనా?
* ఏకంగా కలెక్టర్ వార్డుల్లో పర్యటన
* మొద్దు నిద్ర వీడని నగరపాలక సంస్థ అధికారులు
* పాలకవర్గం లేక ప్రశ్నించేవారు లేక ఇష్టారాజ్యంగా కొందరు తీరుపై

**శ్రీకాకుళం, సెప్టెంబరు 28 (వార్త):** జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం రోజురోజుకూ చెత్తచెత్తగా మారుతోంది. చెత్త సేకరణ ఎలా జరుగుతుందన్న దానిపై పర్యవేక్షించే వారు కరువయ్యారు. ఒక సరైన ప్రణాళిక లేదు. నగరపాలక సంస్థ అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితమవుతున్నారు. కనీసం వార్డులకు వెళితే పారిశుద్ధ్యం ఏవిధంగా తెలుస్తుంది. డ్రైనేజీలన్నీ పూడుకుపోయాయి. ఏ రోడ్డులో డ్రైనేజీ చూసినా ఆక్రమణలే. శతాబ్దాల నాటి డ్రైనేజీని పూర్తిగా ఆధునికీకరించాల్సిన అవసరం ఉన్నా ఎందుకో నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. చిన్నపాటి వర్షం పడితే చాలు డ్రైనేజీలో నీరు రోడ్డుపైకి వస్తోంది. కార్పొరేషన్‌కు గత కొన్నేళ్లుగా పాలకవర్గం లేదు. దీంతో ప్రశ్నించేవారు లేకపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో 249 పోస్టులు ఖాళీగా ఉంది. మొత్తం 408 మంది ఉద్యోగులకుగానూ కేవలం 159మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అరకొర సిబ్బంది కారణంగా అధికారుల పర్యవేక్షణ లేక ప్రజలకు అంతంతమాత్రంగానే సేవలు అందుతున్నాయి. ఉన్న సిబ్బందిపై పని భారంతో సతమతమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పది అంశాల ఆధారంగా మునిసిపాలిటీలకు ర్యాంకులు ప్రకటించగా, శ్రీకాకుళం కార్పొరేషన్‌కు 78వ ర్యాంకు లభించింది.

## కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని అధికారులు

వర్షపు నీరు నగర వీధుల్లో నిలిచిపోకుండా, కాలువల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నగర పాలక సంస్థ అధికారులకు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారులు మాత్రం బేఖాతర్ చేస్తున్నారు. శనివారం నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్, పాత బ్రిడ్జి, ముత్యాలమ్మ మార్కెట్, సత్యానగర్ ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించి రహదారులు, కాలువల పరిస్థితిని సమీక్షించారు. పాత బ్రిడ్జి నుండి ఆర్ అండ్ బి రహదారిని పరిశీలించిన కలెక్టర్ వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గమనించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువలపై ఎక్కడైనా నిర్మాణాలు చేసి ఆటంకాలు కలిగిస్తే వాటిని తొలగించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్ల ఇరువైపులా కాలువలను పునరుద్ధరిస్తూ వర్షపు నీరు ఎటువంటి అడ్డంకులు లేకుండా నదిలోకి చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇకనైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రతిరోజూ వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులు జరిగేలా చూడడంతో పాటు కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తే కొంతమేరైనా చెత్త సమస్యకు ఒక పరిష్కారం దొరుకుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# మాక్ టెస్ట్‌కు విశేష స్పందన

* ఆర్‌ఆర్‌బి, గ్రూప్ డి పరీక్షలకు 244 మంది విద్యార్థులు హాజరు * మెయిన్ ఎగ్జామ్స్‌లో స్కోరింగ్‌కు ఉపయుక్తమంటున్న అభ్యర్థులు * కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు

**శ్రీకాకుళం, సెప్టెంబరు28(వార్త):**కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆర్.ఆర్.బి, గ్రూప్ డి అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య కళాశాలలో జరిగిన మాక్ టెస్ట్‌కు 244 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి చేరువ చేసే మార్గాలను దగ్గర చేస్తున్నారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. డీఎస్సీ, గ్రూప్స్, కానిస్టేబుల్, ఆర్.ఆర్.బి ఇలా పోటీ పరీక్షలు అన్నింటికీ సమాయత్తం అయ్యేలా యువతను సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి సైతం యువత తరలివస్తున్నారు. మాక్ టెస్టు నిర్వహించడం, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి అవసరమైన మెటీరియల్ అందివ్వడం, నిష్ణాతులచే తరగతులు చెప్పించడం, పరీక్షకు సన్నద్ధమయ్యేలా వారిని తీర్చిదిద్దే బాధ్యత ఎర్రన్న విద్యాసంకల్పం చేపట్టింది. సత్ఫలితాల సాధన దిశగా కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోంది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే వివిధ పోటీ పరీక్షల్లో ఎర్రన్న విద్యా సంకల్పం విద్యార్థులు స్పష్టమైన ఫలితాలు సాధించడం ఇందుకు నిదర్శనంగా మారుతోంది. తాజాగా ఆదివారం రోజున జరిగిన కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్‌లో మొత్తంగా 244 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్.ఆర్.బికి తీసిపోని స్థాయిలో పరీక్షను నిర్వహించారని, ప్రశ్నాపత్రం కూడా ఆ స్థాయి విలువలతో ఉందని తెలిపారు. ప్రధాన పరీక్షలలో మంచి మార్కులు సాధించడానికి ఈ మాక్ టెస్టులు ఉపయుక్తంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఇలాంటి పరీక్షను ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# దుర్గమ్మకు కరెన్సీ నోట్లతో అలంకరణ

**సారవకోట/జలుమూరు, సెప్టెంబర్ 28(వార్త):** సారవకోట మండలం అవలంగిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆరో రోజు అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు అందించిన రూ.2 లక్షల విలువ చేసే వివిధ రకాల నోట్లతో అలంకరించారు. ఈ నగదును తిరిగి భక్తులకే అందజేస్తామని ఆలయ అర్చకులు, నిర్వాహకులు తెలిపారు. కరెన్సీ నోట్లతో అలంకరించిన దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఘనంగా భవాని పడిపూజ

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 28 (వార్త):** పాకివలస కనక దుర్గాదేవి ఆలయంలో ఆదివారం భవాని మాతలు, స్వాములు ఘనంగా పడి పూజా కార్యక్రమం నిర్వహించారు. గురుభవాని చంద్రమోహనరావు ఆధ్వర్యంలో భవాని మాతలు, స్వాములు భజన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారు ఆదివారం మహాచండి రూపంలో పసుపు రంగు చీరలో భక్తులకు దర్శన మిచ్చారు. దేవి నవరాత్రులు సందర్భంగా అమ్మవారి రోజుకొక రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.



### వాసుదేవుని సన్నిధిలో..
# శ్రీరాజ్యలక్ష్మికి ప్రత్యేక పూజలు

*** స్వామి, అమ్మవారి పూజల్లో మందస సంస్థానదీశులు * భక్తులతో కిటకిటలాడిన ఆలయం**



**మందస, సెప్టెంబరు 28(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళుని సన్నిధిలో వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శరన్నవరాత్రులు సందర్భంగా శ్రీరాజ్యలక్ష్మి దేవికి ప్రతీరోజూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక సేవలను ఆదివారం ప్రారంభించారు. కమలాలతో అమ్మవారికి శ్రీసూక్త హవనం కావించారు. రాత్రి ఊంజల్ సేవ, నక్షత్రహారతి చేశారు. ఉభయదారులుగా కిల్లంశెట్టి నాగేశ్వరరావు, మీరాబాయి దంపతులతో పాటు భక్తులు పూజలు చేశారు. వాసుదేవున్ని సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేకువ జామునుంచి వేదమంత్రాలతో ఆలయ ఆవరణ మారు మోగుతోంది. వాసుదేవునికి ప్రత్యేక అలంకరణను అర్చకులు కావించి, భక్తులు దర్శనం చేయిస్తున్నారు. నవరాత్రులు సందర్భంగా వాసుదేవ ఆలయానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చి, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ఆలయంలో జరుగుతున్న శ్రీరాజ్యలక్ష్మి ప్రత్యేక పూజల్లో మందస సంస్థాన పాలకుల వారసులు పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో మందస జమీందారులకు అర్చకులు ఆహ్వానించి, స్వామి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మూలా నక్షత్రం సందర్భంగా ఈ నెల 29న స్వామి మూలమూర్తికి ఉదయం 8గంటలకు అభిషేకం జరుగుతుందని, సాయంత్రం యథావిధిగా రాజ్యలక్ష్మిదేవికి సేవలు కొనసాగుతాయని దాసుకూర్మా చార్యులు చెప్పారు.





## రైతుల సహకారంతోనే ఉద్యమం బలోపేతం
### వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు

**మందస, సెప్టెంబరు 28(వార్త):** వంశధార సాగునీరు సాధన కమిటీ చేస్తున్న ఉద్యమానికి రైతుల సహకారం అందిస్తున్నారని వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు అన్నారు. మందస మండలంలోని హరిపురం గ్రామంలో మార్పు గ్రంథాలయంలో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామాల పర్యటనలో పోస్ట్ కార్డు ఉద్యమం, గ్రామ పంచాయతీ తీర్మానాలు సేకరించాలన్నారు. ఇప్పటివరకు జరిగిన గ్రామ సభలలో ఉద్యమం బలోపేతానికి రైతులు సహకరిస్తామన్నారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి, కొర్ల హేమారావుచౌదరి, దుంపల వైకుంఠరావు, కొర్నాన గంగాధర్, అంపోలు త్రినాధ్రు, మజ్జి బాబురావు, పెద్దింటి శశిధర్, కొవ్వూరు దశరథి, దుర్యోధన, ఉగ్రిపిల్లి సోమనాదం తదితరులు పాల్గొన్నారు.



### కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి
# ఐక్య పోరాటాలు

*** సీఐటీయూ మహాసభలో వక్తలు పిలుపు**




**మందస, సెప్టెంబరు 28(వార్త):** ఐక్యపోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. సీఐటీయూ మందస మండల మహాసభ మందసలో నిర్వహించారు. ముందుగా హైస్కూల్ జంక్షన్ నుండి కొత్తవీధి జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో వారు మాట్లాడుతూ జీడి కార్మికులు, రైస్ మిల్లు కార్మికులు, హమాలీలు శ్రమ దోపిడీకి, ఆర్థిక దోపిడీకీ గురవుతున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ గ్రాట్యూటీ వంటి కార్మిక చట్టాలు యాజమాన్యాలు అమలు చేయడం లేదని, కార్మికులు భద్రత లేకుండా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. జీడి, రైస్ మిల్ కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని, కళాసీలకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీం వర్కర్స్ కు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ, కార్మికులకు ప్రాతినిధ్యం వహించే అతి పెద్ద కార్మిక సంస్థ సీఐటీయూ కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఆర్థిక అసమానతలు లేని నూతన సమాజం కోసం, స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో 1970లో ఐక్యత, పోరాటం నినాదంతో ఏర్పడిన సీఐటీయూ అనేక చారిత్రాత్మక ఉద్యమాలకు వేదిక అయ్యిందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు, కళాసీలు, కార్మికుల పక్షాన అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. పోరాటాలు, అనేక మంది త్యాగాల ఫలితంగా, ప్రజా ధనంతో నిర్మించబడ్డ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో లక్షల కోట్ల సంపదను అదాని, అంబానీలకు, విదేశీ, స్వదేశీ కార్పోరేట్లకు దోచి పెడుతున్నదన్నారు. సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు మాట్లాడుతూ సంఘం ఉంటే రక్షణ కవచంగా ఉంటుందని హక్కులు సాధించుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచడాన్ని వ్యతిరేకించారు. కార్మికవర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం 4కోడ్లుగా మార్చి వేసిందని అన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. సీఐటీయూ నాయకుడు ఆర్.దిలీప్ కుమార్ ఆహ్వానం పలికిన ఈ కార్య క్రమంలో జీడి సంఘం నాయకుడు తెప్పల అజయ్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జగదీష్ బడిత్య, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నాయకుడు తమ్మినేని భాస్కరరావు, హరిపురం కార్మిక, రైతు నాయకుడు నల్ల షణ్ముఖరావు సౌహార్ధ సందేశం ఇచ్చారు.

### నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా మట్ట ఖగేశ్వరరావు, మండల కన్వీనర్ గా కె.కేశవరావు, కోకన్వీనర్‌గా ఆర్.దేవేంద్ర, ఎస్.వల్లభరావు కమిటీ సభ్యులుగా కె.కృష్ణారావు, బి.మల్లేషు, ఆర్.ఏకాశి, జి.బాలమ్మ, బి.చంద్రావతి, బి.భారతి, తదితరులను ఎన్నుకున్నారు.



## మహిళా ట్రైనీ పోస్టులకు ఇంటర్వ్యూలు

**శ్రీకాకుళం, సెప్టెంబరు 28 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని బలగలో ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఈనెల 27న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళా విభాగంలో ట్రైనీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. డూల్ వెట్, టాటా స్ట్రైవ్ బృందాల సహకారంతో, బలగ ఐటీఐ ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో ఈ ఇంటర్వ్యూలు విజయవంతంగా జరిగాయి. మహిళల కోసం పర్మినెంట్ విభాగంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఇంటర్వ్యూలు నిర్వహించడం ఇదే మొదటిసారి. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక చొరవతో, ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యలకు కూడా టాటా కంపెనీ ప్రోత్సహిస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగాలతో పాటు ఉన్నత చదువులను ప్రోత్సహిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు ప్రకటించడంపై హాజరైన మహిళా అభ్యర్థులు తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఇంటర్వ్యూలకు మొత్తం 55 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, హెచ్.ఆర్.బృందం ప్రతినిధులు, టాటా స్ట్రైవ్, డూల్ వీట్ బృందం సభ్యులు, టీడీపీ నాయకురాలు అంబటి లక్ష్మీ రాజ్యం, ఏడీ డీఎల్టీసీ రామ్ మోహన్, టీపీవో డీఎల్టీసీ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

## 7న ట్రైనీ టీమ్ మెంబర్ ఉద్యోగాలకు ఎంపిక

**శ్రీకాకుళం, సెప్టెంబరు 28 (వార్త):** శ్రీకాకుళం పట్టణంలోని స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోడలెజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్నేషన్ కంపెనీ (క్యాడ్బెర్రీ చాక్లెట్ కంపెనీ) ట్రైనీ టీమ్ మెంబర్‌గా ఉద్యోగ అవకాశాలకు అక్టోబర్ 7వ తేదీన ఎంపిక జరగనుంది, వీటికి సంబంధించి ఇంటర్, ఐటిఐ, డిప్లమాలో 50 శాతంతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు 18 సంవత్సరాలు నుండి 21 సంవత్సరాలు లోపు గల పురుషులు, మహిళలలు అర్హులు. ఇందులో ఇందులో ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారు 20వేలు జీతంతో పాటు మొదటి నెల ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించి రెండో నెల నుండి సబ్సిడ్జ్ భోజన, వసతి సదుపాయం కల్పిస్తారు. ఆసక్తికర అభ్యర్థులు అక్టోబర్ 7వ తేదీన ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక నెహ్రూ యువ కేంద్రానికి రెజ్యూమ్, సర్టిఫికెట్లు జిరాక్స్‌తో పాటు హాజరుకావాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 7095731303 సంప్రదించాలన్నాఉ.

## అన్నప్రసాదం వితరణ



**పలాస, సెప్టెంబరు28(వార్త):** దసరా దేవి శరన్నవరాత్రులు సందర్భంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు, సూదికొండలోని కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా భవాని అమ్మవారు మండపం వద్ద పూజకమిటి ఆధ్వర్యంలో ఆదివారం అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ పలాస-కాశీబుగ్గ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, సీపాన ఈశ్వరరావు, బగాది సింహాచలం, కొనారి అది భవాని, బోనెల శ్రీకాంత్ భవానీ, జోగి పవన్ భవానీ, పినమింటి ఎర్రన్నాయుడు భవానీ, లండ నారాయణ భవానీ, సీపాన శ్రీకాంత్, బోనెల ప్రకాష్, కొనారి శివ, దశి, డంబురు, పొట్టి రామారావు, నిమ్మరావు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## రట్టినిలో శానిటేషన్ పనులు

**మెలియాపుట్టి, సెప్టెంబర్ 28 (వార్త):** రట్టిని గ్రామంలో ఆదివారం శానిటేషన్ పనులను చేపట్టారు. గ్రామంలో రోడ్డుకి ఇరువైపులా శుభ్రం చేశారు. డ్రైనేజీలు, నదికి వెళ్లే రహదారి, పంచాయతీ భవన ప్రాంతం, వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరుస్తూ శానిటైజేషన్ చేసి బ్లీచింగ్ సైతం చేసినట్లు రట్టిని సర్పంచ్ ప్రతినిధి హరిచంద్ర సామ్యూల్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, మీలా సింహాచలం, నరేష్, తరుణ్, చరణ్, మనోజ్, చైతన్య, యువకులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, సెప్టెంబరు 28 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరి ష్కార వేదిక సోమవారం జిల్లా పరిషత్‌లో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

## నరసన్నపేటలో పందుల స్వైర విహారం



**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబరు28 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధి లోని పలు వీధులలో పందులు స్వైర విహారం చేస్తు న్నాయి. దీనివల్ల దోమలు విజృంభించి జ్వరాలు వ్యాప్తి చెందు తున్నాయి. మారుతి నగర్, గాంధీ నగర్ ప్రాంతంలో పందులు అధికంగా తిరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# డిజిటల్ బుక్.. కార్యకర్తలకు శ్రీరామ రక్ష

*** మా కార్యకర్తలను వేధిస్తే.. ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టం * వైసీపీ నేతలు * నరసన్నపేటలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ**



**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబరు28 (వార్త):** కూటమి ప్రభుత్వంలో వేధింపులకు గురవు తున్న వైసీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా నిలవడానికే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని ఎంపీపీలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ అధ్యక్షులు కసుసు సీతారాం, కణతి కృష్ణారావు తెలి పారు. అన్యాయం జరిగిన కార్యకర్తలందరూ ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆదివారం నరసన్నపేట వైసీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలలుగా అరాచక పాలన సాగుతోందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను, వైసీపీ హయాంలో పనిచేసిన అధికారులపై అక్రమ కేసులు పెడుతూ అనాగరికంగా వ్యవహరిస్తున్నారు. ఎవరికి అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ అసంతృప్తి పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు గురుగుపల్లి రమణి, పొందర కూరాకుల విభాగం అధ్యక్షులు రాజాపు అప్పన్న, డిఎల్‌డిఏ అధ్యక్షులు నక్క తులసిరావు, జిల్లా పార్టీ కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, వైస్ ఎంపీపీ పాగోటి రాజారావు, పతివాడ గిరీశ్వరరావు, కేసీహెచ్‌బీ గుప్తా, జుత్తు నేతాజీ, ధర్మాన జగన్, ధర్మాన రమణ, పొన్నాన ముసలినాయుడు, కల్లేపల్లి లక్ష్మణరావు, బబ్బోది ఈశ్వరరావు, కోటిపల్లి శ్రీనివాసరావు, పట్ట ఠాగూర్, మూకళ్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల కృత్రిమ అవయవాల ఎంపిక శిబిరం

**మందస, సెప్టెంబరు 28(వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మందస పట్టణంలో శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ (విజయనగరం) ఆశీస్సులతో, మదర్ చారిటబుల్ ట్రస్ట్(సొండిపూడి) ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఎంపిక, ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కృత్రిమ అవయవాలకు 32మంది దివ్యాంగులకు కొలతలు తీసుకోగా, ఇద్దరు దివ్యాంగులకు చంక కర్రలు, ఇద్దరూ వృద్ధులకు వినికిడి యంత్రాలు అందజేశారు. మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ భాస్కరరావు మాట్లాడుతూ కాలు లేని దివ్యంగులు నియోజవర్గంలో ఎక్కడ ఉండకూడదన్న సంకల్పంతో నూటికి నూరు శాతం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఇవ్వడం కోసం కంకణం కట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ రట్టి లక్ష్మణ్ కుమార్, మండల ప్రెసిడెంట్ తెలుకుల సురేష్, ఓబీసీ జోనల్ ఇంచార్జి రౌతు చిరంజీవిరావు, జిల్లా పూర్వ వైస్ ప్రెసిడెంట్ కొర్రాయి బాలకృష్ణ, వీహెచ్ పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరరావు, ఓబీసీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ పున్నయ్య, బీజేపీ సీనియర్ నాయకులు కృష్ణమోహన్, లోక్కిజు ధర్మారావు, శ్రీనివాసరావు, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ టెక్నీషియన్ కోటేశ్వర రావు, మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎం.భాస్కరరావు పాల్గొన్నారు. మదర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలను పలువురు అభినందించారు.

## 29న శ్రీముఖలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు

**జలుమూరు, సెప్టెంబరు28 (వార్త):** దక్షిణ కాశీగా పేరున్న శ్రీముఖ లింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 29వ తేదీన హుండీ లెక్కింపు చేస్తున్నట్లు ఆలయ ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. సోమవారం జరిగే హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న భక్తులు డ్రెస్ కోడ్ పాటించి రావొచ్చన్నారు. ఆలయ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు అర్చకులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు ఉంటుందన్నారు.

## గాయపడిన వ్యక్తి మృతి

**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబరు28 (వార్త):** నరసన్నపేటలో శని వారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీ కొని గాయపడిన వ్యక్తి రిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలాకి మండలం గాతలవలస గ్రామానికి చెందిన బమ్మిడి దామోదరరావును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాల పాల య్యారు. నరసన్నపేట ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. ఆదివారం తెల్లవారుజామున మృతి చెందగా.. పోలీసులు కేసు నమోదు చేశారు.

### గడ్డి మందు తాగి..

నరసన్నపేట మండలం కంబకాయ గ్రామానికి చెందిన కెల్ల రాజారావు గడ్డి మందుతాగి శనివారం మరణించారు. కుటుంబ కలహాలు కారణంగా మనస్తాపం చెందిన రాజారావు 26న సాయంత్రం గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న రాజారావును కుటుంబ సభ్యులు నరసన్నపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్ చేర్చగా అక్కడే చికిత్స పొందుతు మృతి చెందాడు. భార్య రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబరు28 (వార్త):** ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ సారధ్యంలో నరసన్నపేట మండ లం దేవాది గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతులతో వరి పొలాలో సామూ హికంగా 35 ఎకరాలకు జిల్లేడు ద్రావణం డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేశారు. జిల్లేడు ద్రావణం పిచికారి చేయడం వల్ల వరి పంటలో రసం పిలిచే పురుగుల నివారి స్తాయి. అలాగే పంట గ్రోత్ పెరిగి, చేను నల్లగామారి, గింజ నాణ్యత పెరిగి మొక్కకి నత్రజని, భాస్వరం పొటాషియం అందిస్తుంది. ముఖ్యంగా రసాయన ఎరువుల లేని లోటు తీరుస్తుంది. అలాగే డ్రోన్ వల్ల రైతుకు ఖర్చు తగ్గుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో డ్రోన్ సహాయంతో స్ప్రేయింగ్ చేయవచ్చు అని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ రైతులకు ప్రకృతి వ్యవ సాయంపై సలహాలు సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.రాజేశ్వరమ్మ, కమలమ్మ, గొండు సూర్యారావు, గొండు లక్ష్మణరావు, బాగిరెడ్డి రామారావు, యాల్ల రాజ్యలక్ష్మి, సిమ్మ శ్రీనివాసరావు, ధర్మాన నరసింహులు, గంగరాపు వెంకటరమణ, ధర్మాన శ్రీరాములు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## దుర్గగిరి శిలా శాసన పరిరక్షణకు హామీ

**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబరు28 (వార్త):** పోలాకి మండలం దీర్ఘాసి గ్రామంలోని 9వ శతాబ్దం నాటి శిలాశాసన ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ ఏడి ఎల్.వెంకట మధు అన్నారు. ప్రపంచ పర్యటక దినోత్సవాన్ని శనివారం దుర్గగిరి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ యువజన సంఘ సభ్యులు శిలా శాసన రక్షణకు భవన నిర్మాణం చేయాలని, దుర్గమ్మ చెరువును సుందరంగా తీర్చిదిద్దాలని, చిల్డ్రన్స్ పార్క్ నిర్మించాలని, దుర్గమ్మ చెరువు ప్రాంతం నుండి కాలనీ వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, దుర్గమ్మ కొండా శిలా శాసన ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరచాలని ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన మండల ప్రత్యేక అధికారి పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సర్పంచ్ కృష్ణ సుమంగళి మాట్లా డుతూ కాలనీ ప్రాంతం నుండి దుర్గమ్మ చెరువు వరకు విద్యుత్ దీపాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తామని ఎం.వి. నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బైరి భాస్కరరావు, ఎంపీడీవో రవికుమార్, డిటి ప్రసాదరావు, పర్యాటకశాఖ గైడ్లు అశోక్ కుమార్, మూర్తి, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న జనసేన నేతలు

**సారవకోట/జలుమూరు, సెప్టెంబరు28 (వార్త):** సారవకోట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శరన్నవ రాత్రి ఉత్సవంలో భాగంగా ఆదివారం నరసన్నపేట నియోజకవర్గ జనసేన నాయకుడు లుకలాపు రంజిత్ కుమార్.. దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయన వెంట మండల జనసేన నాయకులు బచ్చల పృథ్వీ, మాజీ ఎంపీటీసీ కోన వెంకటేష్, లోపింటి రాము, కళింగపట్నం చలపతి, డోల గణపతి, గొంటి ఎర్రయ్య, నేతింటే దిల్లేశ్వరరావు ఉన్నారు.

## ఋషి యోగ కేంద్రంలో దుర్గమ్మ సంబరాలు

**వీరఘట్టం, సెప్టెంబరు 28 (వార్త):** మండల కేంద్రం వీరఘట్టంలోని ఋషి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం కోట దుర్గమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. యోగా కేంద్రంలో యోగ విద్యను అభ్యసిస్తున్న సభ్యులందరూ కలిసికట్టుగా దుర్గమ్మ సంబరాలు చేపడుతున్నారు. ఇందులో మహిళలు పెద్ద ఎత్తున ఘటాలను తీసుకొని మెయిన్ రోడ్డు గుండా దుర్గమ్మ గుడికి చేరుకుని మొక్కుబడులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో యోగ కేంద్రం గురువులతోపాటు కోట దుర్గమ్మ తల్లి ట్రస్ట్ బోర్డ్ ఆర్గనైజర్ జామి లక్ష్మీనారాయణ, తూముల రమేష్, అచ్యుతరావు పాల్గొన్నారు

## జన సైనికులను గుర్తించండి

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు28(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన పార్టీ మున్సిపాలిటీ ఇంచార్జి రోకళ్ల భాస్కరరావు, కంచిలి మండలం జలంత్రకోట పంచాయతీ జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి డొక్కరి సోమేష్‌లు జిల్లా జనసేన పార్టీ ఆఫీస్‌లో జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్‌ని మర్యాదపూర్వకంగా కలిసి జనసేన పార్టీ అంతర్గత విషయాలు మీద చర్చించారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ అధినాయకత్వం లోపాల వలన కష్టపడే జన సైనికులకు, నాయకులకు, మధ్య సమన్వయ లోపం ఉన్నందువలన పార్టీలో కష్టపడే నాయకులకు జన సైనికులకు వీర మహిళలకు గుర్తింపు లేనందువలన 80శాతం మంది జనసేన సైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని, అధినాయకత్వం చేస్తున్న లోపాలను ఎదిరించి జనసేన నాయకులను అడిగిన ఎడల జన సైనికులపైన కార్యకర్తలు నాయకులపైన అధినాయకత్వం వేరే పార్టీ వారిని ఉసిగొల్పుతూ తమపైన బురద జల్లుతూ వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ దుర్భాషలు ఆడుతూ గొడవలు సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు. పార్టీలో ఉన్న పెద్దలు ఈ విషయంపై విచారణ వేసి సరిచేయాలని లేని యెడల జన సైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు, నాయకులు తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.

## ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**పలాస, సెప్టెంబరు 28 (వార్త):** పలాస రైల్వే గ్రౌండ్‌లో అండర్ 12 క్రికెట్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. 10 క్రికెట్ టీములు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఆంధ్ర, ఒరిస్సా క్రికెట్ అభిమానులు, రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. నరసన్నపేట యంగ్ క్రికెట్ అసోసి యేషన్ వర్సెస్ రాజ్ క్రికెట్ క్లబ్ పలాస మధ్య మొదటి మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఐఎఫ్ఆర్ వర్కింగ్ కమిటీ మెంబర్ సిర్ల రాజశేఖర్ మాట్లాడుతూ ఆటలు మనిషికి మానసిక, శారీరక ఆనందాన్నిస్తాయన్నారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ నాయకులు పి వి వి రావు, విక్రమ్ రామారావు, ఆర్ భీమారావు, బి వై బి ఎం నాయుడు, రవి చౌదరి దువ్వాడ, ఆర్ భాస్కర్ రావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇలియాస్ అహ్మద్, డిస్ట్రిక్ట్ మెంటర్, క్రికెట్ కోచ్‌లు జగదీష్, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు సన్మానం

**మందస, సెప్టెంబరు 28(వార్త):** పట్టుదల, కృషి, అంకితభావంతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వక్తలు అన్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ-2025, ఎస్ఐ ఫలితాలలో సత్తాచాటిన వివేకానంద స్టడీ సెంటర్ పూర్వపు విద్యార్థులు కొర్రాయి కుశరాజు (ఎస్ఏ, మ్యాథ్స్), ఎస్ఐ చిత్త కార్తీక్, పి.రోజా(ఎస్ఏ, సోషల్) దాసరి ఈశ్వరరావు ఆధ్వర్యంలో అభినందించి, సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతమైన హరిపురంలో 2016వ సంవత్సరంలో ప్రారంభించిన వివేకానంద స్టడీ సెంటర్ నుండి అనతి కాలంలోనే అనేకమంది ఉన్నతమైన ఉద్యోగాలలో స్థిరపడ్డారని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొందడం చేత 2019లో కోచింగ్ సెంటర్‌ను మూసివేసినప్పటికీ, విద్యార్థులు కోచింగ్ సెంటర్ పేరుతో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొని బహుమతులు అందిస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. వెనుకబడిన ఉద్దాన ప్రాంతంలో వివేకానంద స్టడీ సెంటర్‌ను స్థాపించి అనేకమంది ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దినందుకు వే టు సక్సెస్ సంస్థ వ్యవస్థాపకుడు సీహెచ్ దామోదరం, తదితరులు ఎర్రముక్కాంలో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోగారావు, బాలకృష్ణ, సాయికుమార్, నర్తు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లో చదువును నిర్లక్ష్యం చేయొద్దు



**కోటబొమ్మాళి, సెప్టెంబరు28 (వార్త):** పండగ సెలవుల్లో విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయొద్దని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు శాంత కుమారి అన్నారు. అమె ఆదివారం తోటి ఉపాధ్యాయులతో కలిసి తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల గ్రామాలు చరణదాసుపురం, రామకృష్ణాపురం, కొత్తపల్లిలకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లా డారు. విద్యార్థులు చదువుతున్నది లేనిది ఆరా తీశారు. ఆమె వెంట ఉపాధ్యాయులు గౌరి, షణ్ముఖరావు, తిరుపతిరావు ఉన్నారు.

## ఆదిత్యుని సన్నిధిలో విజయనగరం ఎస్పీ

**అరసవల్లి, సెప్టెంబర్ 28(వార్త):** ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామిని ఆదివారం విజయనగరం ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ దంపతులు, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ పర్యవేక్షకులు వెంకట రమణ, జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి ఘనంగా స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అలాగే స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. టికెట్లు రూపేనా రూ.2,78,800, పూజలు, విరాళాల రూపంలో రూ.66,718, ప్రసాదాల రూపంలో రూ.2,04,040 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546